## 1980 సంక్రాంతి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రు. 116/- గెలుచుకున్న కథ

చనిపోయేవారికి చేసే జీవ ప్రాయశ్చిత్తం, ఒకప్పుడు ఎదురు తిరిగి, బంధాలు త్రెంచుకోలేనివారికి ప్రాయశ్చిత్తంగా పరిణమించవచ్చు.

నరహరిని నేలమీద పెట్టారు.

వెళ్ళవలసిన వాళ్ళందరికి, విధిగా వారంముందే వార్తలు పంపాడు, నరహరి పెద్ద కొడుకు దయానందం.


దగ్గర, దూరపు చుట్టాలంతా దిగుతున్నారు. ఇంకా దిగవలసిన వాళ్ళున్నారు. వచ్చిన వాళ్ళు రానివాళ్ళమీద సొడ్డు వేస్తున్నారు.

"ఆఖరికి చూట్టానికైనా రాలేదు సుమండి."

"ఏమిటో! మా తరంతోనే ఆఖరు ఆ బంధుప్రేమ, ఆ మర్యాదా, అదీ అంతా అయిపోయినట్టే."

"అంతే మరి. ఆ పాత వాళ్ళం యింకా బ్రతికే వున్నాం ..."

"ఆ వెంకటయ్య నిన్నటిదాకా నరహరి సహాయం పొందుతునే వున్నాడా! ఆయన ప్రాపకంతో ఎన్ని పనులు చేయించుకున్నాడు. తిరిగి వంగైనా చూడలేదు"



దయానందం డాక్టరు దగ్గర నుండి దిగులు ముఖంతో యింటిదారి పట్టాడు. అత డుద్యోగానికి శెలవుపెట్టి చాలకాలమయింది. తిరిగి వుద్యోగంలో చేరాలంటే పై ఆఫీసువారి ఆర్డర్లు కావాలి. ఇటు తండ్రి మృత్యువుతో పోరాడుతున్నాడు. చేత పైసాలేదు. బంధుమిత్రులతో యిల్లు కిటకిటలాడిపోతోంది. అనుకోకుండా వచ్చిపడ్డ ఖర్చు.

ఇప్పుడే దిగాడు పురుషోత్తం లోకానికి రూపకల్పన అతగాడు. వంశవృక్షాలు తిరగవేస్తే నెంబది నరహరికి ఏదో వరసలో ఏమో అవుతాడు. అతగాడి రాకకు మరో కారణంవుంది. సరాసరి వంటింట్లోకి అడుగుపెట్టి "సుభద్రమ్మా?" అంటూ దయానందం భార్యను పిలిచాడు. అంతట్లోకి తాయారమ్మ కంటబడింది. ఆమె నరహరి పెద్ద కూతురు.

"ఎప్పుడొచ్చావమ్మాయ్! కూతురా!"

"నిన్నే వచ్చాం బాబాయ్"

"మీ ఆయన పరంధామయ్యవచ్చాడా?"

"వచ్చారు...."

"ఎలా వుందేం నాన్నకు?"

"మొన్నటినుంచి క్రిందనే పెట్టారు. నాకు చచ్చే భయంగా వుంది. అన్నయ్యే తెల్లవార్లూ...." కంట తడిపెట్టింది.

ఆవిడ శవాకారాలను చూడలేదట. అంగుమీద అడుగుబెటి తండ్రిముఖం యింతవరకు చూడలేదావిడ.

"ఏదో పెద్దవాడు ఆయన రోజులు హాయిగా గడచిపోయాయి. ఏడవకూడదమ్మా! హాయిగా నలుగురిముద్యా వెళ్ళిపోవటమే మంచిది" యిద్దం చేసుకోవాల్సి వచ్చిందతనికి కంఠం.

సుభద్ర చాలా నొచ్చుకుంది. ఆయన పోనీయండి, ఉండని గుండి– అది దైవ సంకల్పం. కోలుకుని తిరగాలని కావలసిన వాళ్ళు కోరుకుంటారు. ఇలాంటి సమయంలో అలాంటి మాటలంటే అయిన వాళ్ళకెంత కష్టంగా ఉంటుందో అవతలి వాళ్ళు గుర్తించరు.

తాయారమ్మ వెళ్ళిపోయింది. రెండో కూతురు పార్వతమ్మకు తగని అహంభావం, గర్వం. ఆమె రాలేదు వచ్చిందాకా నమ్మకంలేదు. మూడో అమ్మాయి కమల ఆనాడు లాంఛనాలేవో జరుగలేదని మొగుడికి కోపం. అతడు చండశాసనుడు. చాలాకాలం భోజనం చేసుకోకుండా అలిగి కూర్చున్నాడుఇంకాఅలుగుతూనేవున్నాడు

"[illegible]భద్రమ్మా! కాస్త కాఫీయిద్దూ! కాస్త పొడుం యెక్కువగా వెయ్యమాత! నాకు చిక్కగా లేకుంటే ఛస్తే త్రాగబుద్ధి పుట్టదు. అంత పొడుం వేసుకొని. ఇంత పంచదార కలుపుకొని, చిక్కని పాలతో చేసుకోవాలమ్మా! అసలు హోటలువాళ్ళకు డబ్బులు పుచ్చుకోవటమేగాని, మంచిగా యివ్వటం రాదు."

నా గురించి —

ఖమ్మంజిల్లా బూర్గంపహాడు తాలూకా, "రుద్రంకోట అనే కుగ్రామంలో 1931లో విజయదశమినాడు పుట్టాను. విజయవాడలో చదివి 1953లో పట్టభద్రుణ్ణయ్యాను వరంగల్లో చదివి 1960లో B. Ed పట్టం పొందాను. "స్వతంత్ర ఆంధ్రసచిత్రవారపత్రిక, భారతి" మొదలగు వాటికి చాలా కథలు వ్రాశాను. సాహిత్యంలో కృషి చేద్దామని ఉపాధ్యాయ వృత్తిలో చేరాను గొర్రె తోకలాగా ఎట్లా చేరానో అట్లాగే వున్నాను

974 ఆనంద దీపావళి కథల పోటీలో "ఆంధ్రజ్యోతి" వారు నాకు కన్సొలేషన్ బహుమతి నిచ్చారు. ఇప్పుడు మళ్ళీ వచ్చింది.

ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా, పర్యవేక్షణాధికారిగా నాకుగల 25 సంవత్సరాల అనుభవంతో విద్యమీద, విద్యాలయాలమీద వ్రాయాలని వుంది. బహుశా వ్రాసినా ఆశ్చర్యంలేదు.

—యామునుజాల శంకరం




హావభావాల వ్యక్తీకరణతో అతని సంభాషణ నడుస్తూనే ఉంది. తీరుబడిగా పీటమీద కూర్చుని ఏమిటో చెబుతూనే ఉన్నాడు. కొందరు ఏమీ లేకపోయినా గంటల కొలది ఏదో కల్పించుకొని మాట్లాడే నైపుణ్యముంటుంది. వచ్చి

ఉచితం ఉచితం ఉచితం

తెల్లమచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :

GAUTAM CHIKITSALAYA
(S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్టు, బొల్లి, క్యాన్సరు సంతానంలేని వారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్స వలన దేహములోని అన్నివ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజర్,
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు P.O.,
విశాఖపట్టణము-17.

యింత సేపయింది కాని, అటుగా వెళ్ళి నరహరి నింకా చూడటానికి తీరిక చిక్కలేదు.

"ఏమిటో! వెధవ అలవాటు. ఆ చుక్క గొంతులో పోసుకొని. ఒక చుట్ట ముట్టించి, అలా బహిర్భూమికి పోయి, నదిలో స్నానం చేసి—"

ఆమె కాఫీ యిచ్చింది. అతడు చప్పరించాడు.

"అబ్బే! పొడుం వేశావే కాదు. పంచదార కొంచెం వెయ్యి. కాఫీ ఏమంత బాగాలేదు...."

యాంత్రికంగా పంచదార వేసిందామె. అంత పొడుం కూడా సరిపోలేదు. ప్రొద్దుటికి ప్రొద్దున "వెధవ తుర్రు నీళ్ళం"టూ అవతల పారబోసి పోయింది ఆడబడుచు కాఫీ డబ్బా. పంచదార డబ్బా ఖాళీ అయ్యాయి.

సుభద్ర ఒక్కసారి ఉస్సురుమంది. ఆవిడకు ప్రొద్దుటినుంచి ఆ కాఫీ దగ్గరే సరిపోయింది, యిల్లు కిటకిట లాడుతోంది. అత్తయ్యలట, మావయ్యలట, బాబయ్యలట, పిన్నమ్మలట-పిల్లలు ఒక రేమిటి దిగుతున్నారు. సాధింపులు, సవార్లు, యెక్కువవుతున్నాయి.

పెండ్లి అయితే, ఒకటి రెండు రోజుల ముందునుండి, ఒకటి రెండు రోజుల తరువాత్తో అంత మవుతుంది. దీనికి యెన్ని రోజులముందో అర్థం కావటంలేదు ఆ తరువాత పన్నెండు రోజులు సలక్షణంగా సాగాలి. పెండ్లి అయితే ఏ వొక్కరు రాకపోయినా పట్టించుకోరు. ఇప్పుడలాకాదు.

మధ్యతరగతి కుటుంబాలవారి ఆచార వ్యవహారాలవల్ల ఏర్పడిన అనర్థం.

"ఆయనకాఫీకూడా త్రాగలేదు రాత్రుళ్లు నిద్ర కూడా వుండటం లేదాయనకు. డాక్టరు దగ్గరకు వెళ్ళారు. అక్కడ పడిగాపులు పడాలి. వందలు వేలు గుప్పించే మహారాజులకు రావాలిలాంటి రోగాలు. పూటకు టకానాలేనివారికింత లేసిజబ్బులా?"

ఆవిడ అరుగుమీదికి తొంగి చూసింది. మావయ్య మంచం దగ్గర ఎవ్వరూ లేరు. తెరచిన నోటిలో ఈగలు వాలుతున్నాయి. వాటిని తరిమి నీళ్ళుబెట్టి మొహం తుడిచింది. అలాచేస్తూ వుంటే ఆవిడ హృదయ మెందుకో బావురు మన్నది. స్పృహలేకుండా పడి వున్నాడు మానవుడు. రెండు రోజులుగా క్రిందపెట్టి వుంచారు. పులిలాగ పదిమందిలో బ్రతికాడు. ఇప్పుడేం జరుగుతున్నదో తెలియని స్థితిలో వున్నాడు.

పోయింగంటే. ప్రాణం పోయిందని. మంచంమీదినుండి ఈడ్చి క్రింద పారేశారు. ఆమె కళ్ళద్దుకుంటూ వుంటే ఆ దృశ్యం జ్ఞప్తికొచ్చింది.

"అంతే దయానందం! పోయినట్టే."

"మహా అయితే యింకో అరగంట.."

"అంతసేపూ వుండకూడదు-మరి.."

"అమ్మాయ్! సుభద్రా! అబ్బే! అలా ఏడవకూడదు."

"గుండె రాయి చేసుకో."

"ఆ నీళ్ళలో రెండు తులసి దళాలు వెయ్యమ్మా!"

"ఒరేయ్! దయానందం ఆ దళాలతో రెండుచుక్కలు ఆ జీవి గొంతులో విడవరా...."

"పురోహితుడుకూడా వచ్చాడు."

"దయానందం, ఆ జీవప్రాయశ్చిత్తం కానీయరా...."

"నిజమే. అంతగా బ్రతికిన వాడు. కాస్త సువర్ణదానం, కాస్త భూదానం, గోదానం — పోనీ వాటి క్రింద విడివిడిగా 'తుభ్యమహం కరిష్యే' అంటూ ధనదానం చేసేయి- ఆ పుణ్యం ఆ జీవికి సంక్రమిస్తుంది...."

"రఘు రాలేదేం.... వేణును కూడా పిలు...."

రఘు.... ఏం సమాధానం ఎవరు చెబుతారు. ముగ్గురు కొడుకుల్లో రఘు రెండవ వాడు. వేణు ఆఖరు వాడు. తప్పించుకునే సమాధానమొచ్చింది.

కళ్ళు తుడుచుకుందామె. అంతా కల్పనా కవిత్వమే. కోళ్ళు కూసేవేళ మావయ్యను లాగి క్రింద పారవేసి, ఆయన చేత చేయించవలసిన ఖర్చు చేయించారు.

"పోనీలే సుబ్బులూ! ఇహ ఖర్చు పెడదామన్నా పెట్టలేంకదా...." అన్నారాయన.

"ఇంకా ప్రాణ మున్నదండి...."

"ఛస్! అలా అనకు. మావయ్య. వాళ్ళూ అంతా అంటున్నారు. వాళ్ళకంటె మన కెక్కువ తెలుసా?...."

* * *

"ఒసెయ్! రామీ!!" దొడ్లో అంట్లు తోమే పనిమనిషి వచ్చింది. మంచం వేయమంది. ఇంట్లోకివెళ్ళి ఉతికిన జంపకానా రెండు దుప్పట్లు తెచ్చింది ప్రక్కవేసింది.

"అటు కాళ్ళకేసి పట్టవే!"

"అమ్మా!"

"పట్టమన్నాను, నువు నాకేంచెప్పవద్దు. పట్టు- ఆయన విలువ ఎవరికేం తెలుసు. నాకు తెలుసు- మా అనుబంధం మాటల్లో చెప్పలేనిది-పట్టు...."

మంచంమీద పడుకో బెట్టి దుప్పటి కప్పింది.

వార్త పాకింది. "అయ్యయ్యో!" అన్నారు. "రామ-రామ" అన్నారు.

"అబో-దిబో" మన్నారు. ముక్కులమీద వేళ్ళు వేసుకున్నారు.

"జీవప్రాయశ్చిత్తం చేసిన వ్యక్తిని. మంచం మీద పడుకోబెట్ట వచ్చా! ?...."

దయానందం: "సుభద్రా!...." పిలిచాడు. కోపంతో ఉంటే అలానే పిలుస్తాడు. అందులో గద్దింపు. అధికారం వుంటుంది. "నాన్నను మంచంమీద ఎందుకు పడుకోబెట్టావ్? ఎవరు చేయమన్నారీపని?...."

"ఎంత తప్పు...." పురుషోత్తం వాపోయాడు.

ఒకళ్ళు మరొకళ్ళ తప్పులనెన్ని తమ మంచితనం చూపించుకుంటారు. ఒకళ్ళు మరొకళ్ళను తిడుతూ వుంటే మూడో వాళ్ళకేదో సంతృప్తి.

"ఒకళ్ళు చేయమంటే నేను చెయ్యలేదు" చాలా నిబ్బరంగా అందామె. "ప్రాణం పోలేదూ అంటూంటే నా మాట వినకుండా క్రింద పారవేశారు. నన్నెవరు కన్నారో నాకు తెలియదు. కాని నన్ను మావయ్య పెంచాడు. పెండ్లి చేశాడు ఇంత దాన్ని చేశాడు. ఎందుకు? ఆయనకు సేవ చేసే అదృష్టం నాకు కల్పించాడు. ఆయన్ను బ్రతికుండగానే చంపేయటం నాకిష్టం లేదండి" ఆమెకు దుఃఖమాగింది కాదు. "నేనలా చేయలేను.. చూడలేను.."

"సుబ్బులూ!" ఆ పైన మాటలు తడుముకుంటూ "కాని — అంతా తప్పంటున్నారు...."

"అయితే అయింది. దాని చెడు మనకే గదా. నాకేం భయంలేదు. ఎలాంటి చెడు వచ్చినా. సంతోషంగా భరిస్తాను. మన కోసం జీవితం ధారపోశాడండి." ఆ పైన దుఃఖంతో మాటలు పెగల్లేదు. ఆమె పరాయిది కాదు. స్వర్గస్తురాలైన నరహరి చెల్లెలు విమలమ్మ బిడ్డ. తండ్రి మరో పెండ్లి చేసుకున్నందున మావయ్య యింట్లో పెరిగింది.

దయానందం కిటికీ దగ్గరగా వెళ్ళాడు.

ఆకాశంకేసి చూస్తూ అన్నాడు "సుబ్బులూ నువ్వంటే మొదట్లో నాకిష్టముండేదికాదు. మనిద్దరికి పెండ్లి చేస్తానంటే నేను వద్దన్నాను కూడా. అయినా మా నాన్న వదలిపెట్టలేదు. ఆయనంటె ఎంత ప్రేమో. అంత భయం నాకు. మా నాన్నకు సేవజేసి నా హృదయాన్ని జయించావు" వెనక్కు తిరిగి ఆమెకేసి చూశాడు. కష్టాల్లో సానుభూతి పూర్వకమైన ఒక్క మాట వింటే దుఃఖం కట్టలు తెంచుకుంటుంది "ఏడవకు సుబ్బులూ! నేను చెప్పింది నిజం. పైవాళ్ళెవరైనా అయితే. నాకు వచ్చిన ఈ కష్టాల్లో లేచిపోదురు. సుఖానికి కాని దుఃఖానికి కాదు నిన్ను పెళ్ళాడింది" అన్నా.

కిటికీలోంచి బయట ప్రహరీ గోడమీద ఆడుకుంటున్న పిచికల జంటను చూస్తున్నాడు. బయటినుండి వచ్చే గాలి వల్ల అతనిజుట్టు రెపరెపకొట్టుకుంటోంది. సూర్య కిరణాలు నుదుటిని ముద్దుపెట్టుకుంటున్నాయి.

"జీవితాల గురించి మనం చేసుకునే తీర్పులు సరియైనవి కాకపోవచ్చు. అలా



కేశ సంపదకు

రీటా




స్త్రీలూ పురుషులూ వాడవచ్చును

సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది

అయితే నేనొక అపూర్వమైన రత్నాన్ని పోగొట్టుకునేవాడిని."

ఆమె ఉప్పొంగిపోయింది. అయినా పైకి కనబరచలేదు.

"రఘు కావాలనికోరి పెద్ద సంబంధం చేసుకున్నాడు. ఆ పెండ్లిలో యిచ్చిన కట్నం, పెట్టిన నగతప్ప మరింకేం అంత లేదు. అంతే. మనిళ్ళల్లో పెళ్ళితోనే అన్నీ అయిపోతాయి. సుశీలలో వేర్పాటుధోరణి వుంది. మొగుణ్ణి కొంగున ముడివేసుకొన్నది. పాళ్ళు. పంపులంటూ కబుర్లు వస్తున్నాయి. పాళ్ళట నేనేదో పాముకుంటున్నానని వాళ్ళ కనుమానం. రఘుకు తెలుసుగదా మన పరిస్థితులు. అయినా వాడు ఆమోద ముద్రవేస్తున్నాడు. వాడింతవరకు రాకపోవటం తప్పుగదూ! నలుగురిలో నేను నవ్వులపాలవుతున్నాను. వేణుని తీసుకొని రమ్మని రంగారావుకు కబురుచేశాను...."

"డాక్టరుగారు రాలేదు." ఆమె మాట మార్చింది.

"ఆయనేం చెప్పలేకపోతున్నారు. చిత్రమయిన కేసు. ప్రాణి కొట్టుకుంటోంది. కాఫీ కొంచెం తెచ్చిపెట్టు"

"అయిపోయింది."

"కాస్త కాఫీ అయినా ఉంచకూడదా? త్రాగలేదని తెలుసుగా!" విసుక్కున్నాడు ఆమె మాట్లాడలేదు.

"కొంచెం పెడితే"

ఆమెకు చెప్పక తప్పలేదు "కాఫీపొడుం పంచదార అయిపోయాయి."

"మొన్ననేగా తెచ్చింది. అయిదుకిలోల పంచదార కిలోపొడుంఅయిపోయిందా?"

"అంతా నేనే మ్రింగానంటారా?" విసుక్కుంది.

"ఎంత నిర్లక్ష్యం. ఎంత ఖర్చవుతున్నదో తెలుసా? నీకేం బాధ. తెచ్చేదానవు నువ్వుకాదుగా. చచ్చేదాయన కాదే...."

చాలా కోపంగా వెళ్ళాడు. క్షణ క్షణానికి పరిస్థితుల వత్తిడికి అతని మూడ్సు మారుతున్నాయి.

"ఇదిగో అబ్బాయ్! దయానందం" పురుషోత్తం పిలిచాడు. అంత కోపంవల్లా రిఅటు వెళ్ళాడు. ఫలానివారి వంశం ఎలాంటిది. పొలం పుట్రా వుందా. ఇల్లు స్వంతమా? అబ్బాయి యెలాంటివాడు? కట్నం యెంతలో వుంటుంది? సవాలక్ష ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నాడు.

ప్రాణిపోక కొట్టుకుంటోందటగా.

సుభద్ర కూలబడింది. విసరివేసినట్లుగా క్షణం తీరికలేదామెకు. వండాలి. వడ్డించాలి, కాఫీలు! మామయ్యసంగతి చూడాలి తెల్లవార్లూ ఆయనొక్కరే వుంటే, ఏం జబ్బు చేస్తుందోనని. తనుండి ఆయన్ను పడుకోమంటుంది. పైగా తన పిల్లలు. ఇంతమంది ఆడవాళ్ళొచ్చారు. తీరిగ్గా కూర్చుని యెడతెగని కబుర్లు చెప్పుకుంటున్నారు. స్నానాలు, చీరెలు విడచి చీరలు కట్టుకోవటం — స్నోలు. పౌడర్లు— ముచ్చట ముడులు — వాటితోనే సరిపోతోంది. సంబరానికో, పెండ్లింటికో. కాలక్షేపానికో వచ్చినట్లుగా వుంది. ఒక్కతి పొయిదగ్గరకు రాదు. చేసే వాళ్ళకు పనులు పురమాయిస్తారు.

మూడు రోజుల నుండి ఒకటే తీరని తలనొప్పి. సుభద్రకు పుట్టెడు జ్వరమున్నట్లు యిదవుతోంది. లేచింది. తూలింది, తలుపు పట్టుకొని తమాయించుకొంది. తనకు మందు కావాలనటం తన కిష్టంలేదు.

ఆడబిడ్డ ఎదురొచ్చి "చూడమ్మా! పెద్దాడికి తలభారంగా ఉందట- కొంచెం కాఫీ యివ్వు." ఆర్డరువేసి, ఎంతో పని ఉన్నట్లుగా సమాధానానికైనా ఎదురుచూడకుండా వెళ్ళింది.

వీధి అరుగుమీది గదిలో బంధుజనం విశ్రాంతి తీసుకుంటోంది; చుట్టరికాలు, సంబంధాలు, కులమతభేదాలు, ప్రపంచ రాజకీయాలు చాలా చర్చకు వస్తున్నాయి.

ఏమనుకున్నారో ఏమోగాని, కనులమ్మ పార్వతమ్మ భర్తల యుక్తంగా దిగారు. పెట్టెలు, బెడ్డింగులు లోనికి చేరుతున్నాయి.

"ప్రాణంపోలేదు. అంతా ఆర్భాటం" అన్నట్లుగా తండ్రి ముఖంలోకి వకసారి తొంగిచూచి లోనికెళ్ళింది పార్వతి. ఎదురొచ్చి ఆహ్వానించ లేదనేకోసం. "ఆ మూల పారేయి. ఆ పెట్టెలు, బెడ్డింగులు" కాస్త దళసరి, పెళసరి మనిషి. మొగుడికి డ్రిల్లు నేర్పుతుంది.

*  *  *

ఇనప్పెట్టె ప్రక్కనున్న యెత్తైన దిమ్మమీద పరచిన పరుపుమీద, గుండ్రటి పొడుగాటి దిండు నానుకొని కూర్చున్నాడు శెటి. తనఖాలు పెట్టుకొని. వడ్డీలకు అప్పులిస్తుంటాడు. అవసరాలనుబట్టి సందర్భాలననుబట్టి వడ్డీరేట్లు మారుతూ వుంటాయి. దయానందాన్ని అదోలా చూచాడు. కాగితం వ్రాయందే అప్పివ్వటానికి వీలుపడదు. తాకట్టుగా యిల్లు వ్రాస్తే యిస్తాడు. మేజర్లయినందున, ముగ్గురన్నదమ్ముల సంతకం కావాలి.

కొట్టుదిగి ఆలోచిస్తున్నాడు. ఏం చేయాలో తోచటంలేదు. ఇప్పుడు అర్జంటుగా డబ్బు కావాలి.

నాన్న మందు కొరతై చావరాదు.

రిమ్‌లెస్ చలువ కండ్లజోడు సర్దుకుంటూ "బావా :-." అని పిలిచాడు ఎక్కడో వెలు విడిచిన మామ కొడుకు. ప్లీడర్ల నిజాయితీపై ప్రశ్నలు వేశాడు. ఎవడు గట్టివాడో చెప్పుతున్నాడు. ఎవరిమీదో యిప్పుడు కోర్టులో కేసుపెట్టాలి! ఆ వాణ్ణి మూడు చెరువుల నీరు త్రాగించి ముప్పుతిప్పలు పెట్టాలి. మూడు నిముషాల్లో జేల్లో తోయించగల సమర్థుడు కావాలి. మాట్లాడే టప్పుడు బంగారపు గొలుసు గలిగిన చేతివాచిని పదిసార్లయినా సర్దాడు.

ఓపికతో తనకు తెలిసిన ప్లీడర్ల పేర్లు, వాళ్ళ ప్రతిభా విశేషాలు పెద్దమనిషిగా చెప్పాడు. తన యింటికి వచ్చిన చుట్టం మరి.

ఇంటికి తిరిగివచ్చి, ఇద్దరు చెల్లెళ్ళను చూచేసరికి. కాసేపు బిత్తరపోయినా, సంతోషం కలిగింది. నలుగురు నాలుగు విధాల చేట చెరగకుండా చేశారు.

ఎక్కడ అప్పు చేసిందో తెలియదు. నలుగురికి కాఫీలు యిచ్చింది సుభద్ర. తనకూ యిచ్చింది. యిస్తూ కొంచెం రహస్యంగా చెప్పింది. ఇంట్లో అన్ని వస్తువులు నిండుకున్నాయి. ఏదో చేసి అప్పైనా చేసి తెమ్మంది.

ఉస్సురంటూ లేచాడు. తన గదివైపు వెళ్ళాడు. గుమ్మంలో విన్నాడు. లోపల రఘు అత్తగారివయిపు వారున్నారు. ఏమయినా పాళ్ళు ఇప్పుడే తేలిపోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నారు.

దయానందం పెద్దబావదగ్గరికివచ్చాడు. కొంచెం దూరంలో రఘు మామగారు కూర్చుని ఉన్నాడు "బావా! మాకు కావలసినవాడివి పెద్దవాడివి అనలిలాంటి సందర్భంలో యిలాంటి మాటలంటానికి నాకే సిగ్గుగా ఉంది. నాకు ఈ యింటిమీదగాని, ఆ కొద్దిపాటి పొలంమీదగాని బ్రతకాలని లేదు. ఇంత తొందరగా కుక్కలు చింపిన విస్తరిలా ఈ సంసారం అవుతుందని అనుకోలేదు. ఎవరైనా నా స్థానం వహిస్తే కట్టుగుడ్డలతో లేచిపోతాను. నాకు చిల్లిగవ్వవద్దు. నేను ఎంత నలిగిపోతున్నానో ఎవరికీ చెప్పుకోలేకుండా వున్నాను...." అతని కంఠం గాద్గదమయింది. "నాకీభారం తగ్గించే ఏర్పాటు చేయి. నీకు నమస్కారం...."

సమాధానం వినకుండా బయటకు వచ్చాడు.

కాని భార్యమాటలు గుర్తుకొస్తున్నాయి. ఇంట్లో అన్నీ అయిపోయాయి. ఏదో చేయాలి?

"దయానందం" – పినతండ్రి పిలి

చాడు. గ్లాస్కో పంచ, బిళ్ళగోచీ పెట్టి కట్టాడు. సిల్కు లాల్చీ. మెడలో సన్నటి బంగారపు గొలుసు. చేతిలో బ్యాగు. అతనికి దయానందం పనిచేస్తున్న ఆఫీసు నుంచి ఒక పర్మిటు కావాలి. ఎవరి ద్వారా ఎవరిని తడపాలి. ఆఫీసరు ఎలాంటివాడు? మొదలైనవి.

తన తండ్రికి పెద్ద తండ్రి కొడుకు తన తండ్రిని చూట్టానికి వచ్చిన వారిలో అతనొకడు! దయానందం అంటీ అంటనట్టుగా ఏదో చెప్పాడు అతనటు యితనిటు బయలుదేరారు.

ప్లీడరు రాజారావుని కలిశాడు. అతను తన తండ్రికి ఆప్తమిత్రుడు కూడాను.

నమస్కరించి కూర్చున్నాడు. తనకు వచ్చిన డబ్బు యిబ్బంది వివరించి. పెద్దవాడుగా తను తాకట్టుమీద అప్పు పుటించే అవకాశం గురించి అడిగాడు.

"మీ నాన్నొక వీలునామా వ్రాశాడు. దాని ప్రకారం ఆ స్తిలో ఎవ్వరికి ఇప్పట్లో ఏలాంటి హక్కు లేదు"

"లేదా?...."

"అవును. చదువుకో. నా దగ్గరో కాపీ ఉంది...."

కమల. పార్వతి పెండిండ్ల అప్పు క్రింద పొలం శెట్టికి తాకట్టులో ఉంది. అందుకే కాబోలు శెట్టి యిల్లు తాకటు పెట్టమన్నాడు. ఫలసాయంతో అయిన అప్పు వడ్డీతో సహా తీర్చాలి. అందుకు దయానందం బాధ్యత వహించాలి

ఇల్లు నాలుగు భాగాల్లో రెండుభాగాలు వేణుకు పోశాడు ఇంటిభారం. పొలం భారం వేణు భారం దయానందం వహించాలి.

చదివాడు. లేచాడు దేవాలయ ప్రాంగణంలో కూర్చున్నాడు. వీలునామాలోని ఒక్కొక్క అక్షరమే గుర్తుకు వస్తున్నది అక్కరకోసం కావలసిన ఒక్కొక్క పైసా కనుపిస్తున్నది. ఏం చేయాలి.

"నా పెద్ద కొడుకు దయానందం సన్మార్గుడు. ధీరుడు. నలుగురిని పోషించే సామర్థ్యం. నిబ్బరం భగవంతుడు వాడికిచ్చాడు వాడిమీద సంపూర్ణ విశ్వాసముంది నాకు.

దీర్ఘంగా నిట్టూర్చాడు. "ఇది ఇలానే జరగాలి" వేణు విషయం ఎవరికీ తెలియరాదని ఆంక్ష విధించాడు తండ్రి. అసలు విషయం తను యిద్దరికే తెలుసు.

వేణులో వెర్రి వేషాలు కనుపించాయి. డాక్టరు ధృవీకరించాడు. ఈ విషయం చేయటపడితే అతనికి పెండ్లికాదు. పెండ్లి ఐస్తే బహుశా తగ్గవచ్చు.

## 'రేపటి' గర్భవతి 'నేడు'

కిరణాల కొరడాల్తో దిక్కుల్ని
చెండాడి
వడగాడ్పులతో వాతావరణానికి
పుటంపెట్టి
నిర్మలమైన నీళ్ళ చెమటని ఆవిర్లుగా
మింగేసి
చిటారు కొమ్మలెక్కి
ఆనందపు కోకిలలై కూస్తుంది
వేసంగి!
తన గర్భాన్ని ఉగ్గుముతూ
చీల్చుకొచ్చే
కారుమేఘాలు
స్వేద జలపాతాలతో
తనని పూర్తిగా ఆర్పేసి
ఆకాశమంతా ఆక్రమించబో
తున్నయ్యని
తెలియదు ఆ కాలానికి.

-అద్దేపల్లి రామమోహనరావు

విశాఖపట్నంలో చదువుకు చేర్పమన్నారు. కాని చేర్పింది మరో చోట అప్పు పెరగటానికి కారణంఅతనుకూడా.

ఇప్పుడు కొంచెం మామూలుగా ఉందట. ఇంకా కొన్నాళ్ళు చూడాలి వాడికి పెండ్లి అదీ చేయాలి కాని—

దిగాలుగా లేచాడు. తనమీద చాలా బరువు వుంది. గింజుకున్నా కదలకుండా కాళ్ళు చేతులూ గటిగా కట్టివేయబడ్డాయి. జీవితంలో ఒక పెద్ద సుడిగుండం.

నడిచే ఎద్దునే నాలుగుసార్లు కడతాము. దయా దాక్షిణ్యాలు లేకుండా. తిండి పెట్టకుండా. గడిగ మీద బరువులువేసి మోయిస్తాము.

గుమ్మంలో వేణు ఎదురయ్యాడు. వాడి కళ్ళలో ఏదో బిత్తరచూపు. వాడి మెదడులో ఏదో సంచలనం. సుఖదుఃఖాతీతమైన వ్యక్తిలా వున్నాడు. "నాన్న చనిపోయాడుగా...." వెకిలిగా అన్నాడు.

లోపల గొల్లున ఏడుపులు.

నరాలన్నీ ఒక్కసారిగా జివ్వున గుంజుకున్నాయి. రెండు సంచులు కట్టినట్లు కాళ్లు బరువుగా పడుతున్నాయి.

"సుభద్ర విరుచుకొని పడింది. స్పృహ తప్పింది" ఎవరో అన్నారు. పడుకోబెట్టి మెల్లగా విసురుతున్నది తాయారమ్మ.

ఎన్నాళ్ళనుండో అనుకుంటున్నది ఈ క్షణంలో అయింది.

తన ఆరుగురు పిల్లల సమేతంగా యిప్పుడే దిగింది దిగీదిగగానే "అన్నయ్యో!" అంటూ గుండెలు బాదుకుంటోంది. తన పెత్తాత విధవకూతురు.

దయానందం తండ్రి దగ్గరగావెళ్ళాడు. ఉత్తర ముఖంగా పడుకోబెటారు. తలవద్ద దీపం వెలుగుతోంది. ముఖం మీద గుడ్డ తొలగించాడు భయంకరంగా. ఎముకల గూడుమధ్య ఎక్కడో లోతుగా పీక్కుపోయి. మూతలుపడ్డ కండల్లోకి చూశాడు.

కొందరు ఎవరినీ యిబ్బంది పెట్టకుండా పోతారు. కొందరు కొందర్ని పీల్చి పిప్పిచేసి చంపి చస్తారు.

"జీవ ప్రాయశ్చితం అయిందిగా"— గొణుక్కున్నాడు— దయానందం.

★

